సాక్షి
సంగారెడ్డి

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



బీసీలకు 50% సీట్లు కేటాయించాలి

వచ్చే ఎన్నికల్లో బీసీలకు అన్ని పార్టీలు 50% టికెట్లు కేటాయించాలని, లేకుంటే తిరుగుబాటు తప్పదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. 8లో



డుమ్మాలకు చెక్!

మెడికల్ కాలేజీతోపాటు అనుబంధ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 8లో

ఐటీఐల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తు తేదీని సెప్టెంబర్ 2వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.రాజేశ్వర రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

న్యూస్‌రీల్

ఓటరు నమోదు డ్రైవ్

కలెక్టర్ శరత్



సంగారెడ్డి టౌన్: సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో జిల్లాలోని ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శరత్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు నమోదు చేసుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఉదయం 10 నుంచి జాబితాతో అందుబాటులో ఉంటారని తెలిపారు. కొత్తగా నమోదు చేసుకునేందుకు ఫారం 6, సవరణలు, మార్పులు చేర్పులకు ఫారం 8, తొలగింపునకు ఫారం 7ను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆయా ఫారాలు అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అయితే జాబితాలో తమ పేరు ఉన్నది, లేనిది, ఏమైనా తప్పులున్నాయా? అన్నది పరిశీలించుకోవాలని అన్నారు. బూత్‌లెవల్ అధికారిని గానీ, voters.eci.gov.in వెబ్‌సైట్‌లో గానీ, హెల్ప్‌లైన్, మొబైల్ యాప్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు కూడా ఫారం 7 వినియోగించాలని సూచించారు.

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రెడ్డి ఖానాపూర్‌లో మరనాత ప్రార్థన ధ్యాన మందిరం మూడో వార్షికోత్సవంలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, పీఏసీ చైర్మన్‌లు దామోదర్‌రెడ్డి, దుర్గారెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు నాయకులు పాల్గొన్నారు.

పథకాలే బీఆర్ఎస్‌కు రక్ష



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

నారాయణఖేడ్: సంక్షేమం, అభివృద్ధి పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని హంగిర్గా(బి)కు చెందిన చంద్రప్ప, నర్సుగొండ, సిద్దప్ప, సంతోష్, బస్వరాజ్, రమేశ్, శంకర్, మల్లేశ్, సంజీవ్ తదితరులు గురువారం కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రాజకీయాలకతీతంగా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అవే రానున్న ఎన్నికల్లో గెలిపిస్తాయని అన్నారు. అనంతరం మండలంలోని గంగాపూర్‌కు చెందిన మహిపాల్‌కు రూ.70వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణ, నాయకులు ధర్మారెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఖేడ్ ఎస్‌బీఐ బ్యాంక్‌కు వెళ్లి భూపాల్‌రెడ్డి.. మేనేజర్, అధికారులతో రైతు రుణమాఫీ, కల్యాణలక్ష్మి, రైతుబీమా తదితర విషయాలపై చర్చించారు.

గొల్ల, కురుమల అభ్యున్నతే ధ్యేయం



లబ్ధిదారులకు గొర్రెలను అందజేస్తున్న నేతలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గొల్ల, కురుమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ కుమారుడు చింతా సాయినాథ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సూరారానికి చెందిన లబ్ధిదారులకు సబ్సిడీపై రెండో విడత గొర్రెలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తొలి విడతలో అందని వారికి ఇప్పుడు అందిస్తోందన్నారు. కేసీఆర్ కులవృత్తుల జీవనోపాధికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని అన్నారు.

అను'బంధం'



రక్షాబంధన్ సందర్భంగా ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్‌కు ప్రముఖ గాయని మధుప్రియ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు రాఖీ కట్టారు. - పటాన్‌చెరు టౌన్



ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు పిచేర్యాగడి సింగిల్ విండో చైర్మన్ స్రవంతి రాఖీ కట్టారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పండుగను జరుపుకొన్నారు. - కోహీర్(జహీరాబాద్)



పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. ఆర్‌సీ పురం కార్పొరేటర్ పుష్ప, మహిళలు.. ఆయనకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. - పటాన్‌చెరు

అయోమయం!

- నర్సాపూర్‌లో ఎటూ తేల్చుకోలేకపోతున్న గులాబీ శ్రేణులు
- మదన్‌రెడ్డి వైపు ఉంటూనే.. సునీతారెడ్డికి టచ్‌లో..
- పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామంటున్న మరోవర్గం
- అభ్యర్థిత్వంపై కొనసాగుతున్న ఉత్కంఠ



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: నర్సాపూర్ నియోజకవర్గంలో గులాబీ కేడర్ అయోమయంలో పడిపోయింది. ఈ టికెట్ ఎవరికి వస్తుందో.. ఎటువైపు ఉండాలో.. తెలియక తికమక పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 115 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థిత్వాలను ఖరారు చేసిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, నాలుగు చోట్ల ఆపేశారు. ఇందులో నర్సాపూర్ నియోజకవర్గం ఒకటి. ఈ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో తనకే టికెట్ ఇవ్వాలని సిట్టింగ్ ఎమ్మెల్యే అనుచరులతో కలిసి మంత్రి హరీశ్‌రావు నివాసానికి, ప్రగతిభవన్‌కు వెళ్లడం, స్థానికంగా పలు కార్యక్రమాలు చేయడం.. ఇలా అన్ని చేస్తున్నారు. అయితే పార్టీ శ్రేణులు మదన్‌రెడ్డి వెంట ఉంటే తీరా సునీతారెడ్డికి టికెట్ వస్తే పరిస్థితి ఏమిటని ఆయన అనుచరులు అయోమయంలో ఉన్నారు. ఇప్పుడే కమిషన్ చైర్‌పర్సన్ వైపు వెళితే తీరా అధిష్టానం ఆయన వైపు మొగ్గు చూపితే రానున్న రోజుల్లో వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా కొందరు ఎంపీపీ, జెడ్పీటీసీలు, ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్ ఎటూ తేల్చుకోలేక పోతోంది.

అక్కడ.. ఇక్కడ టచ్‌లో ఉంటూ..

టికెట్‌పై ధీమాతో ఉన్న సునీతారెడ్డి వర్గం సైలెంట్‌గా పని చేసుకుంటూ వెళుతోంది. మదన్‌రెడ్డి వర్గానికి చెందిన నాయకులు మాత్రం తమ నేతకే ఇవ్వాలంటున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే వద్ద ఉంటున్న కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు.. ఆమెతో టచ్‌లో ఉండటం ఆసక్తికరంగా మారింది. చాలా మంది నాయకులు ఆయన వెంటే ఉంటూ రియల్‌ఎస్టేట్, మట్టి తదితర వ్యాపారాలు చేసుకున్నారు. ఇప్పుడు రేసులో సునీతారెడ్డి పేరు కూడా రావడంతో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

అధిష్టానం ఎవరికి ఇస్తే వారినే గెలిపించుకుంటాం

కొందరు సర్పంచ్‌లు, ఇతర ద్వితీయ శ్రేణి నేతలు తటస్థంగా ఉంటున్నారు. అధినేత టికెట్ ఎవరికి ఇస్తే వారి విజయం కోసం పనిచేస్తామని మరికొందరు ద్వితీయ శ్రేణి నాయకులు చెబుతున్నారు. మొత్తంగా నియోజకవర్గం అభ్యర్థిత్వంపై నెలకొన్న ఉత్కంఠ ఇప్పట్లో వీడే పరిస్థితి కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రహస్యంగా కలిసి వచ్చిన నాయకులు

సునీతారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కొందరు మదన్‌రెడ్డి అనుచరులు హైదరాబాద్ వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న ఆయన సదరు నాయకులను తీవ్రస్థాయిలో మందలించినట్లు తెలిసింది. కాగా వీరిద్దరు ముఖ్య నాయకులు మాత్రం బయటకు కలిసే ఉంటున్నారు. అయితే హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో అధినేత, అభ్యర్థిత్వాలు ప్రకటిస్తున్న సందర్భంగా కూడా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీరు కలిసే టీవీల్లో ప్రసంగాన్ని వీక్షించారు. బయటకు కలిసే ఉన్నప్పటికీ కేడర్ మాత్రం రెండుగా విడిపోయింది. మరోవైపు ఆమె తన పని చేసుకుంటూ వెళుతున్నారు. నియోజకవర్గంలోని అనుచరులను కలుస్తూ వచ్చే ఎన్నికల్లో మద్దతు కూడగట్టుకొని ఎన్నికలకు సంసిద్ధం చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ పురుషోత్తంరెడ్డి
- బొల్లారంలో కార్డన్ సెర్చ్
- 24 వాహనాల సీజ్, పోలీసుల అదుపులో 20 మంది అనుమానితులు



కాలనీలో సెర్చ్ చేస్తున్న పోలీసులు

జిన్నారం(పటాన్‌చెరు): అనుమానితులు, కొత్త వ్యక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి సూచించారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల లక్ష్మీనగర్‌లో కాలనీలో గురువారం తెల్లవారుజాము కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ అనుమానితులను విచారించారు. 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో 24 బైక్‌లను సీజ్ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ, కాలనీలో గంటపాటు సెర్చ్ నిర్వహించామన్నారు. అనుమానం ఉన్న కొత్త వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం సైబర్ క్రైంలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఫోన్‌లకు వచ్చిన అనవసర సందేశాలకు స్పందించొద్దన్నారు. కార్యక్రమంలో సీఐలు నయీమొద్దీన్, లాలూనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్, ఐదుగురు ఎస్ఐలు, 70 మంది పోలీసులు పాల్గొన్నారు.

ముఖం చాటేసిన వానలు

- బోరుబావుల సాగుకూ ఇబ్బందే
- ఆందోళనలో రైతులు
- కల్హేర్, సిర్గాపూర్‌లో 17 వేల ఎకరాల్లో పంటలు



వరి సాగు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్, కల్హేర్ మండలాల పరిధిలోని రైతులు వరి సాగు చేశారు. ఆయకట్టు, చెరువులు, కుంటలు, వ్యవసాయ బోరుబావుల ఆధారంగా పంటలను వేశారు. ఇటీవల వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో బోరుబావుల కింద సాగైన వాటికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లవాగు ఆయకట్టు కుడి కాల్వ పరిధిలో సుల్తానాబాద్, గోసాయిపల్లి, పోచాపూర్, బీబీపేట, మార్డి, కృష్ణాపూర్, ఖానాపూర్(కె), ఇందిరానగర్, కల్హేర్ గ్రామాల రైతులు 5 వేల ఎకరాల వరకు వరి సాగు చేశారు. ఎడమ కాల్వ పరిధిలో అంతర్‌గాం, బోక్కస్‌గాం, కామారెడ్డి జిల్లా మార్డండ, తిమ్మనగర్ గ్రామాల రైతులు 1,200 ఎకరాల్లోనూ, కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో నీటి పారుదల శాఖ పరిధిలో సుమారుగా 100 చెరువులు, కుంటలు, బోరుబావుల కింద సుమారుగా 10 వేల ఎకరాల్లోనూ వరినే వేశారు. ప్రస్తుతం కలుపు తీత దశలో ఉంది. అయితే రైతన్నలకు సమయానికి వర్షాలు కురియడంతో నల్లవాగు ప్రాజెక్టు నిండింది. దీంతో రైతులు వరి సాగు చేసేందుకు నాట్లు వేశారు. నెల రోజులుగా వాన ముఖం చాటేసింది. ప్రస్తుతం కురియకుంటే బోరుబావుల వద్ద పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని రైతుల్లో ఆందోళన నెలకొంది.

వచ్చేది కాంగ్రెస్ సర్కారే

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్
- ఆయన సమక్షంలో పార్టీలో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన మహిళలతో శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కానుకుంట మాజీ సర్పంచ్ రేణుక ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు చెందిన మహిళలు భారీ సంఖ్యలో కాటా ఆధ్వర్యంలో గురువారం పార్టీలో చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ తీరుపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మహిళా అధ్యక్షురాలు కాటా సుధా, మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- 190 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

మనూరు(నారాయణఖేడ్): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మనూరు మండలం ఇస్లాంపూర్, ధన్వార్‌ల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రెండు గ్రామాలకు సంబంధించి 190 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గానికి విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని అన్నారు. తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అన్ని రంగాలను ముందుకు తీసుకెళ్లామని చెప్పారు. అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ రవిందర్‌రావు, సిద్దు, రాజేందర్ పాటిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్ రావు, కోఆప్షన్ సభ్యుడు సలీం, నాయకులు కిషన్ రావు, గులాం పాల్గొన్నారు.

నేటి నుంచి పోలీస్ యాక్ట్



ఎస్పీ రమణ కుమార్

సంగారెడ్డి అర్బన్: జిల్లాలో శుక్రవారం నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ రమణకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ప్రజలు, ప్రజాప్రతినిధులు ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు, పబ్లిక్ సమావేశాలు నిర్వహించవద్దని పేర్కొన్నారు. రాజకీయ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సత్ఫలితాల ముస్కాన్

- నెల రోజుల ఆపరేషన్‌లో 61 మందికి విముక్తి
- నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు



అధికారుల బృందం

ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి బాలకార్మికులకు పని నుంచి విముక్తి కల్పించారు. వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని తల్లిదండ్రులను కోరుతున్నారు.

నారాయణఖేడ్: ఆపరేషన్ ముస్కాన్‌ను జిల్లా పోలీసు శాఖ, ఐసీడీఎస్ అధికారులు సమన్వయంతో చేపట్టారు. నియోజకవర్గాల వారీగా బృందంగా ఏర్పడి పలువురికి విముక్తి కల్పించారు. బాల కార్మికుల గుర్తింపు, బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా నెల రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించారు.

18 ఏళ్ల లోపు వారంతా బాలలే

ప్రభుత్వ నిబంధనల మేరకు 0– 18 ఏళ్ల లోపు వారంతా బాలల కిందే లెక్క. జిల్లాలో వీరు 1.12 లక్షల వరకు ఉంటారని అంచనా. ఈ నేపథ్యంలో ఎంతమంది సంపూర్ణంగా హక్కులు పొందుతున్నారు, ఎంతమంది జీవితాలు దుర్భరంగా మారాయి అనే అంశాలను విశ్లేషిస్తారు. పోలీసు, కార్మిక, స్త్రీ, శిశుసంక్షేమం, బాలల సంరక్షణ విభాగం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు ఈ ప్రక్రియలో భాగస్వామ్యం అయ్యారు. నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరుకు చెందిన పోలీసు డివిజన్లకు నాలుగు బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. ఇటుకబట్టీలు, హోటళ్లు, దాబాలు, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలు, ఆయా నిర్మాణాలు జరిగే ప్రాంతాలను సందర్శించారు. గుర్తించిన వారిని బాలల సంరక్షణ సమితి ఎదుట ప్రవేశపెట్టి వారి జీవితానికి కొత్తబాటలు వేస్తారు.

పనుల్లో పెట్టుకుంటే చర్యలు



జిల్లాలో బడీడు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దు. ఎవరైనా పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు. తల్లిదండ్రులు పనుల్లో కాకుండా బడుల్లో చేర్పించాలి. తమ దృష్టికి వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– సంధ్యారాణి,
జిల్లా సంక్షేమ అధికారిణి, సంగారెడ్డి

ఏటా జూలైలో..

కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా జూలైలో ఆపరేషన్ ముస్కాన్, జనవరిలో ఆపరేషన్ స్మైల్ పేరిట పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. బాల కార్మికులను గుర్తించి బడిబాట పట్టిస్తారు. నెల రోజులపాటు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించి పటాన్‌చెరులో 28 మంది, సంగారెడ్డిలో 13, జహీరాబాద్‌లో 15, నారాయణఖేడ్‌లో ఐదుగురిని గుర్తించారు. ఎవరైనా వీరిని గుర్తిస్తే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కు లేదా 100కు సైతం ఫిర్యాదు చేయొచ్చు. అధికారులు సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు.

క్లుప్తంగా

జాతీయ వర్క్‌షాప్‌నకు గుర్రాలగొంది సర్పంచ్

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఇద్దరు ఎంపిక


ఆంజనేయులు

సిద్దిపేటరూరల్: పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ పంచాయతీపై నేటి నుంచి రెండురోజులపాటు బెంగుళూరులో నిర్వహించే వర్క్‌షాప్‌లో నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామ సర్పంచ్ శాతరాజుపల్లి ఆంజనేయులు పాల్గొననున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఇద్దరు సర్పంచ్‌లు ఎంపికయ్యారు. టీబీ నిర్మూలనకు కృషి చేస్తామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ అవగాహన ఒప్పందాలపై వీరు సంతకం చేయనున్నారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో దేశంలోని ఐదు ప్రాంతాలలో టీబీ ముక్త్ పంచాయతీలపై మొదటి ప్రాంతీయ వర్క్‌షాప్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనే సర్పంచ్‌లు వారి గ్రామ పంచాయతీల ప్రగతిని వివరించనున్నారు.

మందుబాబుల దాష్టీకం

తాండూరు: వీధిలో మద్యం ఎందుకు సేవిస్తున్నారని ప్రశ్నించినందుకు ఓ యువకుడిపై నలుగురు మందుబాబులు కత్తులతో దాడి చేసిన సంఘటన తాండూరు పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు పట్టణం గొల్ల చెరువు ప్రాంతానికి చెందిన సల్మాన్ తన సోదరితో కలిసి మార్కెట్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గొల్ల చెరువు వీధిలో నలుగురు యువకులు రోడ్డుపైనే మద్యం సేవిస్తున్నారు. రోడ్డుపై ఎందుకు మద్యం తాగుతున్నారంటూ సల్మాన్ యువకులను ప్రశ్నించారు. దీంతో కోపోద్రిక్తులపై యువకులు ఇంట్లో ఉన్న కత్తులను తీసుకు వచ్చి సల్మాన్‌పై దాడి చేసి పారిపోయారు. విషయం గమనించిన స్థానికులు గాయాలపాలైన యువకుడిని తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదట ఆసుపత్రిలో వైద్యం చేయించుకోండని, ఉదయం వివరాలు తీసుకుంటామని పోలీసులు బాధితుడికి తెలిపారు.

రవీంద్రభారతిలో ప్రపంచ జానపద దినోత్సవం

బొంరాస్‌పేట: ప్రపంచ జానపద దినోత్సవాన్ని హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం నిర్వహించారు. తెలంగాణ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నుంచి వివిధ కళాకారులు పాల్గొని ప్రదర్శన ఇచ్చారు. కళాకారులను ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రమణాచారి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య తదితరులున్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

కొడంగల్ రూరల్: పలు దొంగతనాలకు పాల్పడిన ఓ దుండగుడిని గురువారం సీసీఎస్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. సీఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం సిలెరి కోట్రికె గ్రామానికి చెందిన సంజీవ్ కొడంగల్‌లో రెండు దుకాణాలు, కోస్గిలో ఒక దుకాణం, కర్ణాటక ముదేళి గ్రామంలో రెండు షాపుల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. గురువారం పట్టణంలో పోలీసులు తనఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు సంజీవ్ తడబడుతూ మాట్లాడటంతో అనుమానం ఆరా తీయగా.. దొంగతనం వివరాలు వెల్లడయ్యాయి. నిందితుడు సంజీవ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెపట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. పది రోజులుగా తమ డిమాండ్ల సాధనకై సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానన్న కేసీఆర్ ఇప్పుడు మాట కూడా మాట్లాడటం లేదని విమర్శించారు. కార్యక్రమంలో చందర్ సింగ్, తుల్జారామ్, చిన్నయ్య, నాగేందర్ రెడ్డి, మిర్జా, గోపాల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్మాలకు చెక్!

- మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో బయోమెట్రిక్ విధానం అమలు
- సమయపాలనకు అధిక ప్రాధాన్యం
- 25 సీసీ కెమెరాలతో నిఘా
- ఢిల్లీ నుంచి జాతీయ వైద్య కమిషన్ పర్యవేక్షణ


మెడికల్ కళాశాల

మెడికల్ కాలేజీతో పాటు అనుబంధ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఎన్‌ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రొఫెసర్లు, డాక్టర్లు నిత్యం వస్తున్నారా లేదా.. ఎప్పుడు తిరిగి వెళ్తున్నారనే వివరాలు తెలుసుకునేందుకు బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీనిని ఇరవై ఐదు సీసీ కెమెరాల నిఘాలో ఢిల్లీ నుంచి పర్యవేక్షిస్తారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రభుత్వ మెడికల్ కళాశాల, దాని అనుబంధ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలం దిస్తున్న డీఎంఈ డాక్టర్లపై ప్రత్యేక నిఘా ఉంచేలా జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. హాజరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా బయోమెట్రిక్ యంత్రాలను ఏర్పాటు చేసింది. సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీతో పాటు జీజీహెచ్ 10 బయోమెట్రిక్ హాజరు యంత్రాలను ఏర్పాటు చేశారు. 25 సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ విధానం అమలవుతుంది.

పంచ్ కొట్టాల్సిందే..

కళాశాలలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎన్‌ఎంసీ పరిధిలోకి వస్తారు. మెడికల్ కాలేజీతో పాటు జీజీహెచ్ లో వైద్య సేవలందించే వారు విధిగా రెండుసార్లు బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఉదయం 9.30 గంటలకు వచ్చేటప్పుడు.. తిరిగి సాయంత్రం 4 గంటలకు వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారు. బయోమెట్రిక్ తోపాటు సీసీ కెమెరాలతో ఎప్పటికప్పుడు వారి పనితీరును సైతం నేరుగా హైదరాబాద్‌లోని వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ), ఢిల్లీలోని ఎన్‌ఎంసీ పరిశీలించేలా ఏర్పాటు చేశారు. ఆరు నెలల క్రితమే అధునాతన బయోమెట్రిక్ పరికరాలు ఎన్‌ఎంసీ పంపించగా, నెల క్రితం సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేసి అందుబాటులోకి తెచ్చారు.

25 కెమెరాలతో నిఘా

సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీతో పాటు జీజీహెచ్ లో ప్రొఫెసర్లు 26 మంది, అసోసియేట్ ప్రొఫెసర్లు 14 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 68 మంది, సీనియర్ రెసిడెంట్లు 48 మంది పని చేస్తున్నారు. ఆయా టీచింగ్ డాక్టర్స్ పేరు, ఆధార్ నంబర్, మెడికల్ రిజిస్ట్రేషన్ నంబర్, ఫొటో తదితర వివరాలు అన్నీ కొత్తగా ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ యంత్రాలలో పొందుపరిచారు. అయితే బయోమెట్రిక్ హాజరుతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణతో ఆయా డాక్టర్లు నిత్యం వస్తున్నారా లేదా.. ఎప్పుడు తిరిగి వెళ్తున్నారనే వివరాలు తెలుస్తాయి. ఇప్పటికే ఎనిమిది నెలల క్రితం మెడికల్ కళాశాలతో పాటు జీజీహెచ్ లో 25 సీ సీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు సైతం బయోమెట్రిక్



మెడికల్ కాలేజీ చదువుకునే విద్యార్థులకు సైతం బయోమెట్రిక్ విధానం అమలులోకి తేవాలని నిబంధనలు ఉన్నాయి. త్వరలోనే వారికి కూడా అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రతీ క్లాస్ కు హాజరు వేసుకోవాల్సి ఉంటుంది.
– డాక్టర్ వాణి, ప్రిన్సిపాల్ మెడికల్ కాలేజీ, సంగారెడ్డి

ఎన్‌ఎంసీ నిబంధనలు పాటించాల్సిందే..

డీఎంఈ పరిధిలోకి వచ్చే ప్రొఫెసర్ అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎన్‌ఎంసీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఎవరికీ మినహాయింపు లేదు. మెడికల్ కాలేజీతో పాటు అనుబంధ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఎన్‌ఎంసీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో వీరందరిపై మరింత నిఘా పెరిగే అవకాశం ఉంది. ఇకపై బయోమెట్రిక్ హాజరుతో డాక్టర్లందరూ తమ విధులు నిర్వర్తించక తప్పదు.


– డాక్టర్ అనిల్ కుమార్, సూపరింటెండెంట్, సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రి


మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

బీసీలకు 50% సీట్లు కేటాయించాలి

- 5 వేలు కాదు.. 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి
- రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

సదాశివపేట (సంగారెడ్డి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు 50 శాతం ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని, లేని పక్షంలో తిరుగుబాటు తప్పదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్‌ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో టీజేఏసీ జిల్లా అధ్యక్షుడు కొత్తగొల్ల సత్తయ్య స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ విడుదల చేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో బీసీలకు అన్యాయం జరిగిందని, సీఎం కేసీఆర్ పునరాలోచించి వారికి టికెట్లు కేటాయించాలని సూచించారు. దేశంలో 75 ఏళ్లు పాలించిన ప్రభుత్వాలు బీసీ జనాభా ప్రకారం ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక సామాజిక రంగాల్లో ప్రాధాన్యం కల్పించలేకపోయారన్నారు. వారిని కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నారని ఆరోపించారు. 56 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం అందని ద్రాక్షగానే ఉందన్నారు, బీసీలకు 50శాతం సీట్లు కేటాయించి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాలో 18 జిల్లాల నుంచి ఒక్క బీసీ ఎమ్మెల్యే లేరని, ఇంత అన్యాయం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 7 లక్షల మంది బీఈడీ, డీఈడీ చేసిన నిరుద్యోగులు ఉంటే కేవలం 5 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి ప్రకటించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. పీఆర్‌సీ నివేదిక ప్రకారం 25 వేల పోస్టులు భర్తీ చేయాలని ఆర్, కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగులు నిరసన తెలుపుతుంటే 30 మందిపై కేసులు నమోదు చేశారని, వాటిని ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పోస్టులు ఖాళీ లేకపోతే 16 వేల మంది ప్రత్యేక టీచర్ల పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఎందుకు ఆమోదించిందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షులు కొత్తగొల్ల సత్తయ్య యాదవ్, మనబీస్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఏ ముఖీమ్, కౌన్సిలర్ ఇలియాస్ షరీఫ్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గొంగ్లూరి ప్రభు, మనబీస్ ఫౌండేషన్ నాయకులు ఉస్మాన్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఈశ్వర్, శ్రీశైలం, కృష్ణమూర్తి, మల్లేశంయాదవ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు వెండి మకరతోరణం


అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వెండి మకర తోరణాన్ని బహూకరిస్తున్న భక్తులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని శ్రీ సంతోషి మాత ఆలయంలోని అమ్మవారి ఉత్సవ విగ్రహానికి 1.960 కిలోల వెండి మకర తోరణాన్ని గురువారం అలంకరించారు. పట్టణానికి చెందిన బొమ్మెర సత్యనారాయణ జ్ఞాపకార్థం భార్య సరోజన, కుమారులు సంతోష్ కుమార్ దివ్య, ప్రవీణ్ కుమార్ రూప, శివకుమార్ లక్ష్మి ప్రియలు ఈ వెండి మకర తోరణాన్ని అమ్మవారి విగ్రహానికి అలంకరించారు. శ్రీ సంతోషిమాత అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా ఆలయంలో కుంకుమార్చన, అష్టోత్తరముతో పుష్పార్చన, హోమం, అన్నదాన వితరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్, మాజీ ఆలయ చైర్మన్ కాచం కాశీనాథ్, తమ్మిశెట్టి వీరేశం, ధర్మకర్తలు గాదగొని సత్యంగౌడ్, కాముని ప్రభాకర్, చకిలం అమర్నాథ్, కొమురవెల్లి కళ్యాణి, గరిపల్లి సువర్ణ, ఎక్స్ అఫిషియో సభ్యుడు శాకం మధుసూదన్‌రావు, ఆలయ అర్చకుడు రామకృష్ణ, మాజీ ధర్మకర్తలు చింత సంతోష్ కుమార్, గందె మాధురి, సొప్పదండి రాము తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

దౌల్తాబాద్(దుబ్బాక): ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల పరిధి మల్లేశంపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాలు. గ్రామంలో ఓ వ్యక్తి పొలం దున్నుతుండగా మడిలో ట్రాక్టర్ దిగబడిపోయింది. దానిని బయటకు తీయడానికి అదే గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేష్(32)ను తీసుకెళ్లాడు. బయటకు తీసే క్రమంలో ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్‌ను నడుపుతున్న వెంకటేష్ దానికింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో..

సిద్దిపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రావురూకుల గ్రామ శివారులో చోటుచేసుకుంది. రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ కిరణ్ రెడ్డి తెలిపిన వివరాలు. దుబ్బాక మండలం ధర్మాజీపేట గ్రామానికి చెందిన బూరు స్వామి(18) సొంతపని మీద మిత్రుడు కర్నాల సాయితో కలిసి బైక్‌పై బుధవారం రాత్రి సిద్దిపేటకు వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తుండగా రావురూకుల శివారు వద్ద బైక్ అదుపుతప్పడంతో పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టారు. దీంతో స్వామి తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటఉన్న సాయికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని, గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఇటీవలే ఇంటర్ పూర్తి చేసి బీఫార్మసీలో సీటు పొందాడు. సాయి సిద్దిపేటలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. మృతుడి తండ్రి పరశురాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని కారు స్కూటీని ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణ తెలిపిన వివరాలు. అమీన్‌పూర్ పరిధి వందనపురి కాలనీకి చెందిన నలిశెట్టి శివ(30) అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తుంటాడు. గురువారం తెల్లవారుజామున స్కూటీపై వెళ్తున్న శివను బీరంగూడ పెట్రోల్ బంక్ వద్ద వెనుక నుంచి గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో అతన్ని బీరంగూడలోని పనేసియా ఆస్పత్రికి తరలించారు. శివ తండ్రి నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


నర్సారెడ్డి మృతదేహం

మర్కూక్(గజ్వేల్): అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మర్కూక్ మండలం పాములపర్తి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాలు. మండలంలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన నర్సారెడ్డి(60) బుధవారం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని తన భార్య లక్ష్మికి పాములపర్తికి వెళ్తున్నానని చెప్పాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికారు. పాములపర్తి గ్రామానికి చెందిన మంద బాల్‌రెడ్డి నిర్మిస్తున్న నూతన నివాసంలో నర్సారెడ్డి శవమై కనిపించాడు. భర్త మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

దౌల్తాబాద్(దుబ్బాక): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని లింగాయిపల్లి తండాలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మెదక్ జిల్లా చేగుంట మండలం కసాన్‌పల్లి తండాకు చెందిన బాల్‌సింగ్(32) గురువారం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం లింగాయిపల్లి తండాలోని అత్తగారి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం బయటకు వెళ్లిన బాల్‌సింగ్ గ్రామంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ..


ప్రవీణ్(ఫైల్)

హవేళీఘనపూర్(మెదక్): కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెదక్ పట్టణం ఔరంగాబాద్ ఒకటో వార్డుకు చెందిన మస్కూరి ప్రవీణ్(30) కొంత కాలంగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురై అతను ఆగస్టు 28న పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రవీణ్‌ను మెదక్ ఆస్పత్రికి తీసుకెళ్లి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

రైతులకు 'విజ్ఞాన యాత్ర'

- ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో పాడి, వ్యవసాయంపై అవగాహన
- ఉత్పత్తి, మార్కెటింగ్‌పై శిక్షణ


గుంటూరు సంగం డెయిరీని సందర్శించిన హుస్నాబాద్ రైతులు

హుస్నాబాద్‌రూరల్: పంటల సాగు, పాల ఉత్పత్తి, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం, కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో రైతు విజ్ఞాన యాత్రకు శ్రీకారం చుట్టారు. హుస్నాబాద్ ఎంసీసీ పరిధిలో పాల ఉత్పత్తిదారుల సంఘాల అధ్యక్షులను ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు... వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని కర్ణాటకకు తీసుకెళ్లారు. అక్కడ పాల ఉత్పత్తి, పంటల సాగు, వాటి మార్కెటింగ్ విధానం పై అవగాహన కల్పించారు.

పాల ఉత్పత్తి, మార్కెటింగ్..

గ్రామీణ ప్రాంత రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాల ఉత్పత్తిని ఎంచుకుంటారు. చాలామంది ఉత్పత్తి అధికంగా సాధిస్తున్నప్పటికీ గిట్టుబాటు ధర పొందలేకపోతున్నారు. ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ పాల ఉత్పత్తి చేసే డెయిరీలను సందర్శనకు రైతులను తీసుకెళ్లారు. గుంటూరు సంగం, విజయవాడలోని కృష్ణ, విశాఖ డెయిరీల వద్దకు తీసుకెళ్లి పాల ఉత్పత్తి, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు.

మార్కెట్‌లో ధాన్యం విక్రయాలు

రైతులు ఒకే రకమైన పంటలు సాగు చేయడం వలన మార్కెట్‌లో డిమాండ్ తగ్గి గిట్టుబాటు ధర పొందలేకపోతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా పంటలు పండించి లాభాలు పొందాలనే ఉద్దేశంతో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఐదు రోజులపాటు విజ్ఞాన యాత్రలో భాగంగా కర్ణాటకకు తీసుకెళ్లారు. రాయచూర్, హుబ్లీ, ఎల్లాపూర్, అంకోల వ్యవసాయ మార్కెట్లలో రైతులకు కల్పిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, గిట్టుబాటు ధరల గురించి వారికి అవగాహన కల్పించారు. వాణిజ్య పంటల ద్వారా ఎక్కువ లాభాలు వచ్చే అవకాశముంటుందని వివరించారు. బాదం, ఖాజు, మిరియాలు, అల్లం, మిర్చి పంటల సాగుతో ఆదాయం అధికంగా వస్తుందని తెలిపారు.


కర్ణాటకలోని రాయచూర్ మార్కెట్ సరుకులను పరిశీలిస్తున్న హుస్నాబాద్ మార్కెట్ పాలకవర్గం

డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు



డిమాండ్ బట్టి పంటలు సాగు చేయడంపై అవగాహన కల్పించేందుకు మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని కర్ణాటకకు తీసుకెళ్లాం. అక్కడ డిమాండ్‌కు అనుగుణంగా సాగవుతున్న పంటల గురించి వివరించాం. మార్కెట్ డిమాండ్‌ను బట్టి పంటలు పండిస్తే గిట్టుబాటు ధర కల్పిస్తాం. ధాన్యం నిల్వల కోసం గోదాంలు కూడా ఏర్పాటు చేస్తాం. ఈ విషయం గురించి గ్రామాల్లో రైతులకు తెలియజేస్తాం.
– ఎడబోయిన రజిని, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, హుస్నాబాద్,

ఇక్కడే పాల ధరలు ఎక్కువ



కరీంనగర్ డెయిరీ పాల ఉత్పత్తిదారులకు అందించే ధరలే ఎక్కువగా ఉన్నప్పటికీ ఉత్పత్తి తక్కువగా ఉంది. రైతులు వ్యవసాయ అనుబంధంగా పాల ఉత్పత్తి చేయడం వలన ఎక్కువ సేకరణ జరగడం లేదు. వ్యవసాయం కంటే అధిక ఆదాయం పాల పైనే వస్తుంది. సంగం డెయిరీ పాల సేకరణ, రైతులకు కల్పిస్తున్న సంక్షేమ పథకాల గురించి పాడి రైతులకు అవగాహన కల్పించాం.
– నాగయ్య, మేనేజర్, ఎంసీసీ హుస్నాబాద్

ప్రేమికురాలిపై అనుమానంతో..

యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య


రాజేంద్ర దురువే మృతదేహం

పటాన్‌చెరు టౌన్: ప్రేయసి మరో వ్యక్తిని ప్రేమిస్తుందనే అనుమానంతో ఓ యువకుడు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. తాను చనిపోతున్నా అని ఆ అమ్మాయికి మెసేజ్ చేసి ఉరి వేసుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజేంద్ర దురువే(20) అతని సోదరుడు రాకేష్ దురువేలు మూడు నెలల క్రితం బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం భానుర్‌కు వచ్చి మేస్త్రీల వద్ద లేబర్‌గా పని చేస్తున్నారు. అయితే రాజేంద్ర దురువే మూడేళ్ల నుంచి తన రాష్ట్రానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పనికి వెళ్లకుండా ఆ యువతితో ఫోన్‌లో చాటింగ్ చేశాడు. నీవు మరో వ్యక్తితో చనువుగా ఉంటున్నావని, అందుకే నేను ఆత్మహత్య చేసుకుంటున్నానని మెసేజ్ చేసి ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోదరుడు రాకేష్ రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి రాజేంద్ర దూలానికి వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..


చెరువు వద్ద లభ్యమైన లక్ష్మి మృతదేహం


లక్ష్మి (ఫైల్)

దౌల్తాబాద్(దుబ్బాక): అనారోగ్యంతో బాధపడుతున్న భర్త, ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన సూర లక్ష్మి(45), హనుమంతు దంపతులకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు నవీన్ హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తుంటాడు. చిన్న కొడుకు నగరంలోని ఓ హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నాడు. భర్తకు రెండు కళ్ళు కనిపించక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. లక్ష్మి కూలీ పనులు చేస్తుంటుంది. కుటుంబ భారం మోయలేక, భర్త వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న లక్ష్మి మనస్తాపానికి గురై బాధపడుతుండేది. ఆగస్టు 29న ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఆమె రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం దౌల్తాబాద్ రాందాస్ చెరువు వద్ద లక్ష్మి శవమై కనిపించింది. ఆమె మృతికి గల కారణాలు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చేర్యాల(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన ఓయువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని వేచరేణిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బూర్గు సాగర్(19) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ వ్యవసాయం చేస్తున్నాడు. తండ్రి సత్యనారాయణ ఐదేళ్ల క్రితం మరణించడంతో తల్లి అండాలు కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. వ్యవసాయ పెట్టుబడి, కుటుంబ పోషణ భారంగా మారి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. గురువారం సాగర్ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని చేర్యాల మార్చురీకి తరలించినట్లు కొమురవెల్లి ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

క్లుప్తంగా

విశేష అలంకరణలో సంతోషిమాత


ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు

పటాన్‌చెరు టౌన్: సంతోషిమాత అవతరణ సందర్భంగా గురువారం పట్టణంలో కొలువైన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు సంతోష్ మహారాజ్ దత్త మహారాజు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమం, వ్రతాలు నిర్వహించామన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారని దీంతో ఆలయ పరిసరాలు సందడిగా కనిపించాయి.

గొర్రెల పంపిణీ


లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేస్తున్న పశువైద్య అధికారి, సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గొర్రెల పంపిణీ పథకాన్ని గొర్రెల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని పటాన్‌చెరు మండలం పశువైద్యాధికారి శైలేంద్ర జస్వాల్ అన్నారు. గురువారం మండలంలోని పెద్ద కంజర్ల గ్రామంలో 12 యూనిట్ల లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద కంజర్ల గ్రామ సర్పంచ్ రాజు, ఉపసర్పంచ్ హరిశంకర్ గౌడ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌కు చెందిన మల్లేశం(45) గత నెల 27న తన పల్సర్ బైక్‌పై ఝరాసంగం వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జహీరాబాద్ ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుర్తు తెలియని దుండగులు ఓ ఇంటి తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ సంఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధి తెల్లాపూర్‌లో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉండాలి. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అంకురా విల్లాస్‌లో నివాసముండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మనీష్ సింహా సోమవారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. గురువారం ఉదయం పొరుగింటి వారు ఫోన్‌చేసి తలుపులు తెరిచి ఉన్నాయని మనీష్ సింహాకు తెలిపారు. హుటాహుటిన బాధితుడు ఇంటికి వచ్చి చూడగా ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గ్రహించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రాజోల శివారులో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం శివారులో గ్రామానికి చెందిన డప్పూర్ కిస్టా గౌడ్ మట్కా ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వాహకుడిని అదుపులోకి అతడి నుంచి రూ.3 వేల నగదు, మట్కా బుక్, చిట్టీలు స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బీఎస్పీ నాయకుల అరెస్ట్


పోలీసుల అదుపులో బీఎస్పీ నాయకులు

జహీరాబాద్ టౌన్: సూర్యాపేటలోని మంత్రి జగదీశ్వర్‌రెడ్డి ఇంటి ముట్టడికి సమాయత్తమవుతున్న బహుజన సమాజ్‌వాది పార్టీ నాయకులను బుధవారం రాత్రి జహీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్దురావణ్ మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా మంత్రి జగదీశ్వర్ రెడ్డి అనుచరుడిగా ఉన్న జానయ్య బీఎస్పీలో చేరిన తరువాత ఆయనపై కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ఆయనపై పెట్టిన కేసులను రద్దు చేయాలని, లేనియెడల పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. పోలీసులు అరెస్టు చేసినవారిలో నాయకులు సతీష్, శ్రీనివాస్, మోజెష్, యాదగిరి, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

అనుబంధాల వేడుక

తోబుట్టువులు ఏడాదికోసారి రాఖీ పౌర్ణమి నాడు కలుసుకుంటారు. వారికి రాఖీలు కట్టి తమ అనుబంధాలు శాశ్వతంగా నిలిచి ఉండాలని కోరుకుంటారు. గురువారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆడపడుచులు తమ పుట్టింటికి వచ్చి సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనుబంధాల వేడుక సందర్భంగా అన్ని చోట్ల రాఖీ, మిఠాయి దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ప్రజా ప్రతినిధులు, మంత్రులు ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.


జోగిపేటలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు


మంత్రి హరీశ్‌రావుకు రాఖీ కడుతున్న కార్పొరేటర్ పుష్ప నగేష్


సంగారెడ్డిలో..


నారాయణఖేడ్‌లో సురేశ్ షెట్కార్‌కు రాఖీ కడుతున్న సోదరి ప్రవీణ బస్నాలే


న్యాల్‌కల్(జహీరాబాద్): ఎంపీ బీబీపాటిల్‌కు రాఖీ కడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు స్వప్న


జిన్నారం: బొల్లారంలో కౌన్సిలర్ చంద్రారెడ్డికి రాఖీ కడుతున్న చిన్నారులు


పటాన్‌చెరులో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు


ఝరాసంగంలో సోదరుడికి రాఖీ కడుతున్న చెల్లెలు


జహీరాబాద్ టౌన్‌లో నాగరాజ్‌కు రాఖీ కడుతున్న ముస్లిం సోదరి


సదాశివపేటలో తమ్ముళ్లకు రాఖీలు కడుతున్న అక్కాచెల్లెళ్లు

మార్కండేయ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

నారాయణఖేడ్: మండలంలోని వెంకటాపూర్ చౌక్ సమీపంలో మార్కండేయ భవన్ వద్ద మార్కండేయస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం పద్మశాలి సంఘం బాధ్యులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితుడు గురురాజ శర్మ ఆధ్వర్యంలో యజ్ఞోపవిత్ర కార్యం, శిలాన్యాస హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు


అంతారం జీవన్ముక్త సంస్థానంలో కొలువైన పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి

మునిపల్లి(అందోల్): రాఖీ పౌర్ణమి పండగ సందర్భంగా ఇష్ట దేవతామూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం మండలంలోని అంతారం జీవన్ముక్త సంస్థానంలో సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో పాండు రంగ విఠలేశ్వర, రుక్మాబాయి, బుదేరాలో శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి, శ్రీ తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామికి భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా శివధనస్సు ఊరేగింపు


జోగిపేటలో శివధనస్సును ఊరేగిస్తున్న పద్మశాలీలు

వట్‌పల్లి(అందోల్): రాఖీ పౌర్ణమి సందర్భంగా జోగిపేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శివధనస్సు ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. గురువారం పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివధనస్సును జోగినాథ స్వామి ఆలయం వరకు ఊరేగించారు. ఆ ఆలయంలోని శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా పద్మశాలి సంఘం స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు పడిగె సత్యం, చేనేత సహకార సంఘం చైర్మన్ వర్కల అశోక్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూస వెంకటేశం, ఉపాధ్యక్షుడు కొశికే సత్యం, నాయకులు శ్రీనివాస్, మాణయ్య, వెంకటేశం, మధు, రమేష్, సుధీర్, సత్యం, అనంత్‌రాజ్, నారాయణ, రాజశేఖర్, రాజేందర్, బాలరాజ తదితరులు పాల్గొన్నారు.

శివ ధనస్సుకు పూజలు


సదాశివపేటలో గాయత్రి యజ్ఞంకు హాజరైన రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఈశ్వర మార్కండేయ మందిరంలో గురువారం గాయత్రి యజ్ఞం, జంధ్యధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివ ధనస్సును ఊరేగించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు అంబటి విశ్వనాథం, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిలువరి రవికుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

సంగారెడ్డి అర్బన్: జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన గురువారం తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08455-271010 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'త్రీ ఇడియట్స్' చిత్ర ప్రదర్శన


సినిమాను వీక్షిస్తున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: త్రీ ఇడియట్స్ సినిమాను గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రదర్శించారు. ఈ చిత్రం న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రదర్శించిన విషయం విదితమే. విద్యపై సందేశాత్మక చిత్రంగా ఈ చిత్రాన్ని పరిగణిస్తుండటంతో విద్యార్థులు శ్రద్ధగా వీక్షించారు. అమీర్‌ఖాన్, ఆర్.మాధవన్, శర్మన్ జోసి, కరీనా కపూర్, బోమన్ ఇరానీ, ఓమి వెద్య తదితరులు నటించిన ఈ చిత్రం హిందీ భాషలో ఆంగ్ల ఉపశీర్షికలతో ప్రదర్శించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

మెదక్ మున్సిపాలిటీ: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ వెంకటేశ్ సూచించారు. గురువారం పట్టణంలోని సుభాష్ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు వాహన పత్రాలతో పాటు హెల్మెట్ ధరించి ఉండాలన్నారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం


గోసాయిపల్లిలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

కల్హేర్(నారాయణఖేడ్): దివ్యాంగులకు పించన్లు, అర్చకులకు వేతనాలు పెంచడంతో సిర్గాపూర్ మండలం గోసాయిపల్లిలో గురువారం సీఎం కేసీఆర్, ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, సర్పంచ్ సాయాగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యనారాయణగౌడ్, ఉపసర్పంచ్ భూషణం, పూజారులు బస్వరాజు, గ్రామస్తులు సురేఖ, పిట్ల సాయిలు, కిస్టుగొండ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పదవీ విరమణ సన్మానం**



జహీరాబాద్ టౌన్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వహీదొద్దీన్ పదవీ విరమణ చేశారు. గురువారం పంచాయతీరాజ్ యూనియన్ నాయకులు, ఎంపీపీ కార్యాలయం సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్, పంచాయతీ రాజ్ మినిస్ట్రీయల్ యూనియన్ అధ్యక్షుడు రఘు, కార్యదర్శి రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు ఓటరు నమోదు శిబిరం**

నారాయణఖేడ్: కళాశాలలో ఖేడ్ తహసీల్దార్ దేవిదాస్ ఓటరు నమోదు శిబిరం శుక్రవారం ఏర్పాటు చేస్తున్నట్లు మండలంలోని జూకల్ శివారు ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

◆ **బీఎస్పీకి రాజీనామా**

నారాయణఖేడ్: బహుజన్ సమాజ్ పార్టీ మనూరు మండల శాఖ అధ్యక్షుడు యనుముల తుకారాం, ఉపాధ్యక్షుడు ఆనందం పార్టీకి రాజీనామా సమర్పిస్తున్నట్లు గురువారం తెలిపారు. రెండున్నరేళ్లుగా ఖేడ్ నియోజకవర్గ శాఖ అధ్యక్షుడు అలిగే జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ పటిష్టతకు పాటుపడ్డామని, ఆయన పార్టీకి రాజీనామా చేశాక నియోజకవర్గంలో నాయకత్వలోపంతో కార్యకర్తలకు దిశానిర్దేశం లేకుండాపోయిందన్నారు.

◆ **అణగారిన వర్గాలకు అవకాశం ఇవ్వాలి**



నారాయణఖేడ్: నారాయణఖేడ్ కాంగ్రెస్ అభ్యర్థిగా అణగారిన వర్గాలకు అవకాశం కల్పించాలని టీపీసీసీ అసంఘటిత రంగ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ చైర్మన్ దేవనూరు లక్ష్మణ్ కోరారు. నారాయణఖేడ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తనకు అవకావం కల్పించాలని, ఈమేరకు పార్టీకి తాను దరఖాస్తు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎం.మారుతి, శేరి జ్ఞానేశ్వర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్థిక సహాయం**

సంగారెడ్డి మున్సిపాలిటీ: నర్సింగ్‌లో సీటు సాధించిన కుటుంబ ఆర్థిక పరిస్థితులతో ఇబ్బంది పడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫుల్కల్ చెందిన శిరీషకు గురువారం సేవ్ ద గర్ల్ చైల్డ్ సంస్థ రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చక్రపాణి, నవాబు శివకుమార్, కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక**

నారాయణఖేడ్: కల్హేర్ మండలం ఫత్తేపూర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు గురువారం డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో నారాయణఖేడ్‌లోని ఆయన స్వగృహంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం నల్లవాగుకు చెందిన చాకలి వెంకట్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సిఫార్సుతో సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. ప్రభుత్వం రూ.50 వేలు చెక్కు రూపంలో మంజూరు చేసింది. ఈ చెక్కును గురువారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తన నివాసంలో అందజేశారు.



బీసీ నాయకుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

పటాన్‌చెరు టౌన్: బీసీ నేత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్‌కు మద్దతు పెరుగుతోంది. ఆయనకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ వారం రోజులుగా మద్దతుగా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో గురువారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ మహేష్, బొమ్మనుకుంట వార్డు సభ్యులు రాజు, మన్నె రాములు, ప్రభాకర్, మహేష్, యాదగిరి, కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సప్తాహ మహోత్సవం


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రాయికోడ్(అందోల్): మండలంలోని జమ్గి గ్రామంలో నిర్మించిన ఆలయంలో శ్రీ విఠల రుక్మిణీ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రారంభించిన సప్తాహ భజన మహోత్సవం రెండో రోజు గురువారం కొనసాగింది. ఉత్సవాల్లో భాగంగా ప్రవచనము, హరి కీర్తన, కాకడ హారతి, జాగరణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. 3వ తేదీన విగ్రహాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి 4వ తేదీన ప్రతిష్ఠ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

ఘనంగా సామూహిక జంధ్యధారణ


జంధ్యధారణ చేస్తున్న పద్మశాలీలు

కొడిపల్లి(నర్సాపూర్): జంజిరాల పౌర్ణమి సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సామూహిక జంధ్యధారణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రమైన కొడిపల్లిలోని శ్రీ అభయ సీతారామాలయం వద్ద మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పిస్కె నర్సింహులు ఆధ్వర్యంలో ఆలయ పురోహితుడు ఫణీంద్రశర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పద్మశాలి సంఘ సభ్యులకు జంధ్యం ధరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా యువత ఉపాధ్యక్షుడు సంబారపు తిరుమలేష్, డాక్టర్ పురుషోత్తం, మంత్రి క్రిష్ణ, పద్మ దుర్గయ్య, పోల జనార్ధన్, పోల ప్రభాకర్, పోల పురుషోత్తం, మంత్రి ఆంజనేయులు, డాక్టర్ శ్రీనివాస్, పి.శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, నవీన్, లక్ష్మణ్, భీమేష్, రంగేశ్, శ్యాంకుమార్, వీరేష్, నరేందర్, నర్సింహులు శంకరయ్య, కిష్టయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల వినూత్న నిరసన


నిరసన తెలుపుతున్న సెకండ్ ఏఎన్ఎంలు

మెదక్ కలెక్టరేట్: తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు గురువారం వినూత్నంగా నిరసన తెలిపారు. రక్షాబంధన్ పండుగ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులమైన మా గోస అర్థం చేసుకొని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీఎం కేసీఆర్ చిత్రపటానికి రాఖీ కట్టారు. ఈ క్రమంలో సమ్మెలో సెకండ్ ఏఎన్ఎం సోని సొమ్మసిల్లి పడిపోవడంతో మిగతా వారు ఆందోళనకు గురయ్యారు. తస్నీన్, తులసి, రమ్య, యాదమ్మ, సంగీత పాల్గొన్నారు.